విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 227 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఫిబ్రవరి 2025 | వెల : రూ 10/-



## గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దు

- డంపుయార్డుతో కాలుష్యాన్ని నెత్తిన వేయకండి
- గుమ్మడిదలలో నిరసనకు హరీష్ రావు సంఘీభావం

**సంగారెడ్డి,**
గుమ్మడిదలను మరో లగచర్ల చేయవద్దని మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరించారు. ఇక్కడ డంప్‌యార్డు ఏర్పాటును ఉపసహంరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం -మిగతా 3 లో



## ప్రధాని మోడీ అసలు బీసీయే కాదు

### జనగణను తప్పించుకునేందుకే బీజేపీ విమర్శలు

- కులగణన సర్వేపై బీజెపీ, బీఆర్ఎస్‌ల తప్పుడు ప్రచారం
- రాహుల్ గాంధీ మాట శిరోధార్యంగా రాష్ట్రంలో కులగణన
- గాంధీభవన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సీఎం రేవంత్ వ్యాఖ్యలు



**హైదరాబాద్,**
ప్రధాని మోడీ బీసీ కాదని.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని ప్రధాని మోడీపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మోడీ పుట్టుకతో బీసీ కాదని.. ఆయన సీఎం అయ్యాక మోడీ కులాన్ని బీసీలో కలిపారని వ్యాఖ్యలు చేశారు. మోడీ కులం గురించి ఆషామాషీగా చెప్పడం లేదని.. అన్ని తెలుసుకునే ఆయన కులం గురించి మాట్లాడుతున్నానని అన్నారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన కులగణన, -మిగతా 3 లో

## పెద్దగట్టు జాతరకు రంగం సిద్ధం

-భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
-16 నుంచి 20 వరకు జాతర..ట్రాఫిక్ ఆంక్షలు



**సూర్యాపేట,**
రాష్ట్రంలో రెండో అతిపెద్దదైన పెద్దగట్టు జాతరకు రంగం సిద్ధం అయ్యింది. ఈనెల 16 నుంచి 20 వరకు పెద్దగట్టు జాతర జరగనుంది. పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తులకు -మిగతా 3 లో

## స్థానిక ఎన్నికలే లక్ష్యంగా రాజకీయాలు

- బీసీ నినాదంతో అడుగులేస్తున్న పార్టీలు
- రాష్ట్రమంతా కులగణన చుట్టే రాజకీయాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే తప్పులతడకగా మారిందన్న బీజెపీ, బీఆర్ఎస్‌లు
- కులగణన సర్వే ద్వారా లబ్ధి పొందాలన్న ఎత్తుగడలు




**నిజామాబాద్,**
స్థానిక ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ అందరిదీ బిసిల దారిగా మారింది. బిసిలపై గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రేమను ఒలకబోస్తున్నారు. 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. బిసి బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నారు. -మిగతా 3 లో



## సుంకాలపై వెనక్కి తగ్గేది లేదు


- మీ చర్యలకు..మా ప్రతి చర్యలు ఉంటాయి
- మీరు తగ్గిస్తే..ఆ మేరకు మేమూ తగ్గుతాం
- ప్రధాని మోడీతో భేటీలో తేల్చేసిన ట్రంప్

**వాషింగ్టన్**
సుంకాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తేల్చి చెప్పారు. ఇది దేశ హితం కోసం తీసుకున్న నిర్ణయమని అన్నారు. భారత్ ఎంత మిత్ర దేశమైనా.. పరస్పర పన్నుల విషయంలో తగ్గేదేలే అని సున్నితంగా తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా శ్వేతసౌధంలో -మిగతా 3 లో

## బీజేపీ లో ఇమడలేక పోతున్నా

- సొంత పార్టీతోనే పోరాడాల్సిన ఆగత్యం
- అవసరం లేదని చెబితే పార్టీని వీడుతా
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,**
బిజెపిలో ఇమడలేక పోతున్నానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీకి రాజీనామా చేసేందుకు రెడీగా ఉన్నట్లు కూడా ప్రకటించారు. పార్టీలో వేధింపులు తట్టుకోలేక -మిగతా 3 లో






## కొత్త సీఈసీ నియామకం కోసం కసరత్తు

**న్యూఢిల్లీ**
ప్రస్తుత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఈ నెల 18వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో సెలక్షన్ కమిటీ సమావేశమై కొత్త సిఇసిని ఖరారు చేయనుంది. ప్రధాని నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సెలక్షన్ కమిటీలో ప్రధాని మోడీతోపాటు కేంద్ర న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ కొత్త సిఇసి పేరును ఖరారు చేయనుంది. -మిగతా 3 లో

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణకు మేలు



- అప్పులు లేనిదే కదలలేని స్థితిలో ప్రభుత్వం
- పదేళ్ల బీఆర్ఎస్, యేడాది కాంగ్రెస్‌తో ఒరిగిందేమీ లేదు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్న కిషన్ రెడ్డి

**సంగారెడ్డి,**
తెలంగాణలో అప్పులతో ప్రభుత్వం నడుస్తోందని, అప్పులు లేనిదే కదలలేని స్థితికి చేరిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మార్పు రావాలని కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా పూర్తిగా వైఫల్యం అయిందని విమర్శించారు. పదేళ్ళలో బీఆర్ఎస్ పై వ్యతిరేకత వస్తే కాంగ్రెస్ పార్టీపై పది నెలల్లోనే వ్యతిరేకత పెరిగిందన్నారు. తెలంగాణ మొత్తం కల్వకుంట్ల కుటుంబం చుట్టూ తిరిగేలా పదేళ్లు పరిపాలన చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. -మిగతా 3 లో

# రైతులకు కేంద్రం శుభవార్త

**19వ విడత కిసాన్ నిధుల విడుదల**
**24వ తేదీన రైతుల ఖాతాల్లోకి జమ**



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**
రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 19వ విడత పీఎం కిసాన్ నిధుల విడుదల తేదీని ఖరారు చేసింది. ఫిబ్రవరి 24వ తేదీన రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు జమ చేస్తామని వెల్లడించింది. ఫిబ్రవరి 24వ తేదీన ప్రధాని మోడీ బీహార్‌లోని భాగల్పూర్‌లో పర్యటిస్తారని.. ఈ సందర్భంగా ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతిలో పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తారని కేంద్ర ప్రభుత్వ తెలిపింది. అలాగే.. బీహార్‌లోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోడీ ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం భాగల్పూర్‌లో ఏర్పాటు చేసే సభలో పాల్గొని మోడీ ప్రసంగిస్తారు. పీఎం కిసాన్ నిధుల కోసం ఎదురు చూస్తోన్న రైతులకు ఇది ఒక శుభవార్త అనే చెప్పాలి. కాగా, దేశంలో చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక సహాయం చేయడం కోసం 2019లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రారంభించింది. ఈ స్కీమ్ కింద అర్హులైన ప్రతి రైతుకు రూ.2 వేల చొప్పున మొత్తం మూడు విడతల్లో ఏడాదికి రూ.6 ఆర్థిక సహాయం అందజేస్తోంది. ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతిలో రైతులకు ఖాతాల్లో కేంద్రం నిధులు జమ చేస్తోంది. ఇందులో భాగంగానే.. 2024, అక్టోబర్ 5న 18వ విడత పీఎం కిసాన్ నిధులను రైతుల అకౌంట్లో జమ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 24న 19 విడత నిధులను రైతుల అకౌంట్లలో వేయనుంది.

# టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖర్‌కు అరుదైన గౌరవం

**– ప్రతిష్ఠాత్మక నైట్‌హుడ్ పురస్కారం ప్రకటించిన బ్రిటిష్**



**ముంబై, ప్రజా స్వేచ్ఛ**
టాటా గ్రూప్ సంస్థల చైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్‌కు అరుదైన గౌరవం దక్కింది. బ్రిటీష్ ప్రభుత్వం ఆయనకు ప్రతిష్ఠాత్మక నైట్‌హుడ్ పురస్కారాన్ని ప్రకటించింది. బ్రిటన్, భారత్ మధ్య వ్యాపార సంబంధాల కోసం ఆయన చేసిన కృషిని గుర్తించాలని బ్రిటీష్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఆయనకు 'మోస్ట్ ఎక్సలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' అవార్డును ప్రదానం చేయనుంది. ఈ మేరకు బ్రిటిష్ ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నట్టు చంద్రశేఖర్ పేర్కొన్నారు. టెక్నాలజీ, హాస్పిటాలిటీ, ఉక్కు, రసాయనాలు, ఆటోమోటివ్ రంగాల్లో యూకేతో పటిష్టమైన, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం టాటా గ్రూప్‌నకు గర్వకారణం. జాగ్వార్ ల్యాండ్ రోవర్, టెట్లీ లాంటి మా ఐకానిక్ బ్రిటీష్ బ్రాండ్లు మాకెంతో గర్వకారణమైనవి. యూకేలోని మా సంస్థల్లో 70, 000 మందికి పైగా ఉద్యోగులు ఉన్నార'ని చంద్రశేఖరన్ ట్వీట్ చేశారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, వార్విక్ విశ్వవిద్యాలయం, స్వాన్సీ విశ్వవిద్యాలయంతో సహా బ్రిటన్‌లో ఉన్న గొప్ప సంస్థలతో తాము విద్యా భాగస్వామ్యాలను ఆస్వాదిస్తున్నామన్నారు. తనకు గౌరవనీయ అవార్డు ప్రకటించినందుకు బ్రిటిష్ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. చంద్రశేఖరన్ అక్టోబర్2017, జనవరిలో టాటా గ్రూప్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

# ఏవోబీలో మావోయిస్టులు అమర్చిన డంప్‌లు స్వాధీనం



**హైదరాబాద్**
ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో మావోయిస్టులు అమర్చిన డంప్‌లను పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డంప్‌లో బాంబులు, ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, ఎస్ఎంబీఎల్ తుపాకులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 5 కిలోల బరువైన ప్రెషర్ బాంబ్, 5 టిఫిన్ ఐఈడీ బాంబులు, 3 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, ఎలక్ట్రికల్ వైర్లు, 2 ఎస్ఎంబీఎల్ తుపాకులు ఉన్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బాంబులను నిర్వీర్యం చేసినట్లు మల్కాన్‌గిరి పోలీసు కార్యాలయం ప్రకటించింది. అయితే ఏవోబీలో మావోయిస్టులు నాలుగు చోట్ల డంప్‌లు అమర్చినట్లు పేర్కొంది. భారీగా డంప్ లభ్యమైన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెంచారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# భారత్‌కు అత్యాధునిక యుద్ధ విమానాలు

**-ఎఫ్ 35 లైటెనింగ్ యుద్ధ విమానాల విక్రయం**
**-మోడీ సమక్షంలో ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్**



**వాషింగ్టన్, ప్రజా స్వేచ్ఛ**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత దేశానికి అత్యాధునిక యుద్ధ విమానాలను విక్రయించడానికి ముందుకు వచ్చారు. ప్రపంచం లోనే అగ్రశ్రేణి స్టెల్త్ ఫైటర్ జెట్లలో ఒకటైన లాక్‌హీడ్ మార్టిన్ ఎఫ్ 35 లైటెనింగ్ 2 వ రకం యుద్ధవిమానాలను భారత్‌కు అందించేందుకు సిద్ధమంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ సంవత్సరం నుంచి భారతదేశానికి మిలిటరీ ఉత్పత్తుల అమ్మకాలను అనేక బిలియన్ డాలర్లకు పెంచుతామని, భారత దేశానికి ఎఫ్ 35 స్టెల్త్ ఫైటర్లను అందించడానికి మార్గం సుగమం చేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రధాని నరేంద్రమోడీతో సంయుక్త పత్రికా సమావేశంలో పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ ట్రంప్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భారత్ అమెరికాల మధ్య వాణిజ్య, దౌత్య సంబందాలు, రక్షణ రంగంలో పరస్పర సహకారం వంటి అంశాలు వీరి చర్చల్లో చోటు చేసుకున్నాయి. ఆ తరువాత వీరిద్దరూ సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. భారత దేశ ఇంధన భద్రతను నిర్ధారించడానికి, చమురు, గ్యాస్ వాణిజ్యంపై దృష్టి పెడతామని ప్రధాని మోడీ అన్నారు 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యమే మా లక్ష్యం ' అని మోడీ తెలిపారు. ఈమేరకు పరస్పర ప్రయోజన కరమైన వాణిజ్య ఒప్పందం అతి త్వరలో వస్తుందని ఆశిస్తున్నారు.

# కాంగ్రెస్ బలం..బలగం అంతా యూత్ కాంగ్రెస్సే

**-చంద్రబాబు, కెసిఆర్ మూలాలు యూత్ కాంగ్రెస్ నుంచే**
**-తెలంగానలో అధికారంలోకి రావడంతో యూత్ కృషి**
**-కష్టపడి పనిచేస్తే పదవులు అవే వస్తాయి**
**-యూత్ కాంగ్రెస్ నేతల బాధ్యతస్వీకరణలో సిఎం రేవంత్**



**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**
ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్‌పై ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. చందరబాబు, కెసిఆర్ లాంటి వారంతా యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన యువజన కాంగ్రెస్ నేతల ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు, కేసీఆర్ యూత్ కాంగ్రెస్ నుంచే వచ్చారని.. వీరితో పాటు పార్టీలోని అగ్ర నాయకులు అంతా యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని.. అది యూత్ కాంగ్రెస్‌కు ఉన్న పవర్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ బలం, బలగమని.. యూత్ కాంగ్రెస్ శక్తి ఏమిటో మాకు తెలుసని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో యూత్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మిట్టపలి వెంకటేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్టపడి పని చేస్తే పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని.. అనిల్ యాదవ్, బల్మూరి వెంకటే ఇందుకు నిదర్శమని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వీరిద్దరికి పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. కొందరు పదవులు రావడం లేదని నిరాశ చెందుతున్నారు.. టైమ్ వచ్చినప్పుడు అవకాశాలు వస్తాయి.. ఎవరూ పోరాటం ఆపొద్దని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయనంత రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసి చూపించామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం.. భూమి లేని వ్యవసాయ కూలీలకు రైతు ఆత్మీయ భరోసా కింద ర.12 వేలు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవం కోసం ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్రూమ్ పేరుతో కేసీఆర్ ఊరించి మోసం చేశారని.. ఆయన మోసం చేశారు కాబట్టే ప్రజలు మనకు అధికారం ఇచ్చారని అన్నారు. ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని.. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ దేనని అన్నారు.

# రాజకీయ ముసుగులో నేరస్థుల రాక

**-ఎంత ప్రమాదమో గత ఐదేళ్లలో చూశాం**
**-పార్టీ నేతలతో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు**

**అమరావతి, ప్రజా స్వేచ్ఛ**



నేరస్థులు రాజకీయ ముసుగులో ఉంటే ప్రజాస్వామ్యానికి పెనుముప్పు అని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో గత ఐదేళ్లు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వారు ఇప్పుడు కొత్త దారులు వెతుక్కుంటున్నారన్నారని జగన్‌ను, వైకాపాను ఉద్దేశించి అన్నారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి నిజమని నమ్మించాలన్నది వారి తాపత్రయమని మండిపడ్డారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతటివారినైనా ముంచేందుకు వారు వెనుకాడరని స్పష్టం చేశారు. నా దళితులు.. నా దళితులు అంటూనే వారిని నట్టేట ముంచే రకాలని వెల్లడించారు. ఆటవిక రాజ్యంలోనే దాడులు, ఊచకోతలు, విధ్వంసాలు, హత్యలు జరుగుతాయని.. మనది ప్రజాస్వామ్యం, ఇక్కడంతా చట్టపరంగానే పరిపాలన సమర్థంగా నడుస్తుందని పేర్కొన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో అందుబాటులో ఉన్న నేతలతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, కార్యకర్తల సంక్షేమంపై ప్రధానంగా చర్చించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపై త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు సమావేశంలో చంద్రబాబు నిర్ణయించారు. ఎంపీ భరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఏఎస్ రామకృష్ణలతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. భారీ మెజారిటీతో ఆలపాటి రాజా, పేరాబత్తుల రాజశేఖర్‌లను గెలిపించాలని తెలిపారు. ఈ భేటీలో నిమ్మల రామానాయుడు, పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, చింతమనేని ప్రభాకర్, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

# ముంబై ఉగ్రదాడుల నిందితుడి అప్పగింతకు ట్రంప్ అంగీకారం



**ముంబై ప్రజా స్వేచ్ఛ**
ముంబై ఉగ్రదాడి ఘటనలో దోషిగా తేలిన తహవూర్ రాణా ను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 26/11 ముంబై ఉగ్రదాడిలో నిందితుడైన అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిని భారత్‌కు అప్పగిస్తున్నామంటూ ట్రంప్ విలేకరులతో అన్నారు. అంతేకాదు మరింత మంది నేరగాళ్ల విషయంలోనూ అదే నిర్ణయం తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో ట్రంప్ నుంచి ఈ ప్రకటన వచ్చింది. ట్రంప్ ప్రకటనపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ముంబై ఉగ్రదాడి నేరస్థుడిని భారత్‌కు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేసిన ట్రంప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. 64 ఏళ్ల తహవూర్ రాణా పాకిస్థాన్ మూలాలతో ఉన్న కెనడా పౌరుడు. 26/11 ముంబయి ఉగ్రదాడుల్లో కీలక సూత్రధారిగా అతడిని గుర్తించారు. ప్రస్తుతం రాణా లాస్ ఏంజెల్స్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. అతడిని భారత్‌కు అప్పగించాలని భారత్ గత కొంతకాలంగా అమెరికాను కోరుతోంది. భారత ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి అమెరికా గతంలోనే సానుకూలంగా స్పందించింది. ఇక అతడి అప్పగింత విషయమైన భారత్ న్యాయస్థానాల్లో పోరాడుతోంది. ఈ క్రమంలో భారత్ ప్రయత్నాలను తహవూర్ పలు ఫెడరల్ కోర్టుల్లో సవాల్ చేశాడు. తనను భారత్‌కు అప్పగించొద్దంటూ పిటిషన్‌లు వేశాడు. అయితే, రాణా చేసిన పిటిషన్లు అమెరికా ఫెడరల్ కోర్టులు తిరస్కరిస్తూ వచ్చాయి. దీంతో అతడు చివరి ప్రయత్నంగా గతేడాది అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

# ప్రధాని మోడీ అసలు బీసీయే కాదు

(మొదటి తరువాయి)

ఎస్సీ వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణన నివేదికను తప్పు అంటూ మోడీ, కేడీ బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇకపోతే నేను ఆఖరి రెడ్డి సీఎంను అయినా.. ఫర్వాలేదు. మా నాయకుడు ఇచ్చిన మాట నిలబెట్టేందుకు క్రమక్షశిణ కలిగిన ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకున్నానని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది నా నిబద్ధత. కులగణన.. నా కోసం, నా పదవి కోసం చేయలేదు. త్యాగానికి సిద్ధపడే.. కులాల లెక్కలు పక్కాగా తేల్చాం అని స్పష్టం చేశారు. మా నాయకుడి ఆదర్శం నిలబెట్టేందుకు నేను కార్యకర్తగా మిగిలేందుకు సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్వేగంగా అన్నారు.కొందరు ఆరోపిస్తున్నట్టు కులగణన సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగలేదన్నారు. ఇప్పుడు కులగణన సర్వేను తప్పు పడితే బీసీలు శాశ్వతంగా నష్టపోతారు. దేశం మొత్తం కూడా కులగణన సర్వే జరగాలని పార్లమెంట్‌లో మోదీని రాహుల్‌గాంధీ నిలదీశారని గుర్తు చేశారు. ఈ సర్వే జరగకూడదని మోదీ, కేసీఆర్ కలిసి కుట్ర చేస్తున్నారు. నరేంద్రమోదీ పుట్టుకతో బీసీ కులస్థుడు కాదు. గుజరాత్ సీఎం అయ్యాక ఆయన కులాన్ని బీసీ జాబితాలో చేర్చుకున్నారు. సర్టిఫికెట్ ప్రకారం మాత్రమే మోదీ బీసీ వ్యక్తి.. ఆయన వ్యక్తిత్వం మాత్రం అగ్ర కులం. కులగణన జరిగితే చట్ట ప్రకారం రిజర్వేషన్లు సాధించుకోవచ్చు. అధికారిక లెక్కలు ఉంటే బీసీల రిజర్వేషన్లు పెంచాలని సుప్రీంకోర్టు కూడా చెప్పొచ్చన్నారు. కులగణన సర్వే రెండో విడత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఇంటి ముందు మేలుకొలుపు డప్పు కొట్టాలని బీసీ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా. సర్వేలో పాల్గొనకపోతే సామాజిక బహిష్కరణే శిక్ష' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణనకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. కేంద్రం జన గణనతో పాటు కులగణన చెయ్యాలి. అప్పుడు కేంద్ర లెక్కలు, మా ప్రభుత్వ లెక్కలను సరిపోల్చి చూద్దామని సవాల్ విసిరారు. కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీష్‌లను బహిష్కరణ చెయ్యాలి.. బహిష్కరణ కోసం మీ సమక్షంలో తీర్మానం చేస్తున్నానని అన్నారు. ప్రభుత్వ సర్వే తప్పుల తడక అని బీఆర్ఎస్ చెప్పే ప్రయత్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనం కుల గణన విజయవంతంగా నిర్వహించడంతో ప్రధాని మోడీపై ఒత్తిడి వస్తుందనే భయంతో మన సర్వేను తప్పుడు సర్వే అని బీజేపీ వాళ్లు అంటున్నారని ఫైర్ అయ్యారు. సర్వేలో ఎక్కడ తప్పు ఉందో చెప్పాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులను బీసీలు నిలదీయాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల మాటలు వింటే బీసీలకు తీరని నష్టం జరుగుతోందన్నారు.

# సుంకాలపై వెనక్కి తగ్గేది లేదు

(మొదటి తరువాయి)

ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఇరువురు నేతలు సంయుక్త విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రెసిప్రోకల్ టారిఫ్‌ల గురించి వచ్చిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను సమర్థించుకొన్నారు. 'ప్రస్తుతం మేము రెసిప్రోకల్ నేషన్ అంటే ఎదుటి దేశం ఎలా స్పందిస్తే.. అలానే ప్రతిస్పందించే దేశం..అన అన్నారు. భారత్ లేదా మరే దేశమైనా సరే.. మాపై తక్కువ పన్నులు విధిస్తే.. మేము కూడా అలానే టారిఫ్‌లు వేస్తాము. భారత్ మాపై ఎంత శాతం పన్ను విధిస్తే.. మేమూ అంతే ఛార్జి చేస్తాము. వారి సుంకాలు ఎంత ఎక్కువన్నది ఇక మా సమస్య కాదు. నా తొలివిడత పాలనలో అధిక టారిఫ్‌లపై చర్చించాము. కానీ, ఎలాంటి రాయితీలు పొందలేకపోయాం. అందుకే మేము తేలికైన మార్గాన్ని ఎంచుకొన్నాం. వారెంత విధిస్తే.. మేము అంతే ఛార్జి చేస్తాం. అమెరికా ప్రజల కోసం ఇదే సరైన చర్య అని అన్నారు. మాకు ఐరోపా అత్యంత సమస్యాత్మకం. ఎవరూ కనీవినీ ఎరుగని స్థాయిలో మాపై పన్నులు విధిస్తున్నారు. వారు చాలా విషయాల్లో అడ్వాంటేజ్ తీసుకొంటున్నారు. ఆ చర్యలతో మేము ఏమాత్రం సంతృప్తిగా లేము. ఇక చైనా విషయం మరింత భయంకరం. నేను అధికారంలోకి రాక ముందు కనీసం 10శాతం కూడా పన్ను విధించేవారు కాదు. నేను తొలిసారి పగ్గాలు చేపట్టినప్పుడు వారి నుంచి వందల బిలియన్ డాలర్లు పన్నుల రూపంలో వసూలు చేశాం. మేము సరిగ్గా ఎలా చేయాలో అలానే చేశాము' అని ట్రంప్ వివరించారు. మోదీ-ట్రంప్ పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్ల దాటించే లక్ష్యంతో మిషన్-500ను ప్రకటించారు. ఇక మోదీ పర్యటన రోజే పరస్పర టారిఫ్‌ల విషయాన్ని ట్రంప్ ముందుగానే తెరపైకి తెచ్చి బలమైన సంకేతాలు పంపారు. 'మూడు అద్భుతమైన వారాలు. ఇప్పటివరకు అత్యుత్తమైనవి కావచ్చు. కానీ, 'నేడు మాత్రం అత్యంత ముఖ్యమైంది. రెసిప్రోకల్ టారిఫ్స్' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలను పోస్టు చేశారు. మోదీతో భేటీకి కొద్ది గంటల ముందే.. అన్ని దేశాలపై పరస్పర సుంకాలను అమలు చేస్తూ.. ఫైల్‌పై సంతకం చేశారు.

# బీజేపీ లో ఇమడలేక పోతున్నా

(మొదటి తరువాయి)

పోతున్నానని, అవసరం లేదని క్లారిటీ ఇస్తే ప్రాథమిక సభ్యత్వాన్నీ వదులు కునేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. గోల్కొండ,గోషామహల్ జిల్లా బీజేపీ అధ్యక్ష పదవిని తాను సూచించిన బీసీ నాయకుడికి కాకుండా ఎంఐఎం లీడర్ల వెంట తిరిగే వ్యక్తికి ఇచ్చారంటూ మండిపడ్డారు. '2014లో భారతీయ జనతా పార్టీలో నేను చేరినప్పటి నుంచి వేధింపులు భరిస్తున్నా.. ఇక నా వల్ల కావడం లేదు.. పార్టీకి నా అవసరం లేదు.. వెళ్లిపో అని అంటే ఇప్పటికిప్పుడే వెళ్లిపోవడానికి సిద్ధం.. గోల్కొండ జిల్లా అధ్యక్ష పదవి ఎస్సీ లేదా బీసీకి ఇవ్వాలని నేను సూచించాను.. కానీ, ఎంఐఎంతో సంబంధాలు కొనసాగించే వ్యక్తిని నియమించారు. ఇదేంటని పార్టీకి చెందిన కీలక నేతకు ఫోన్ చేసి అడిగితే ఆ విషయం తనకు తెలియదని సమాధానం చెప్పారు.. ఆ జవాబుతో నా వెనుక జరుగుతున్న కుట్ర కోణం బయట పడింది. నేను ఇప్పటి వరకు బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్‌లతోనే పోరాటం చేస్తూ వచ్చాను. కానీ, సొంత పార్టీలోనూ యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఎదుర్కోవడం దురదృష్టకరం.. జిల్లా అధ్యక్ష పదవి అనేది పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ సూచించిన వ్యక్తికి ఇవ్వడం ప్రతిచోటా జరుగుతుంది. కానీ, ఇక్కడ నా సూచన ఎందుకు పక్కన పెట్టాల్సి వచ్చింది. దీనిపై సంజాయిషీ ఇవ్వాలి. వెంటనే అధ్యక్షుడిని మార్చాలి. జీవితంలో నేను ధర్మ ప్రచారం, ధర్మ యుద్ధం నేర్చుకున్నా. ప్రస్తుతం పార్టీలో కొందరిలా బ్రోకరిజం నేను నేర్చుకోలేదు. వాళ్ల కారణంగా ఈ రోజు పార్టీ వెనుకబడింది. రాష్ట్రంలో ఎప్పుడో బీజేపీ ప్రభుత్వం రావాలి. కానీ ఇలాంటి రిటైరైన వ్యక్తులు ఉంటే బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రాదు' అంటూ వ్యాఖ్యానించారు. రాజాసింగ్ కామెంట్స్ బీజేపీలో హాట్ టాపిక్ గా మారాయి. బీజేపీ ఇటీవలే 19 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా మరో నాలుగు జిల్లాలకు ప్రెసిడెంట్లను ప్రకటించింది. గోల్కొండ గోషామహల్ జిల్లా అధ్యక్షుడిగా ఉమా మహేంద్ర, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా సీ గోదావరి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా ఊటుకూరు అశోక్ గౌడ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వల్లభు వెంకటేశ్వర్లు పేర్లను కేటాయించింది. గోల్కొండ జిల్లా అధ్యక్షుడిగా ఉమామహేంద్రను నియమించడంపై రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధ్యక్షుడిని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణకు మేలు

(మొదటి తరువాయి)

కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. 'రాష్ట్రంలో మార్పు రాలేదు... మారింది సీఎం, పార్టీ జెండా మాత్రమే.. పరిపాలన మాత్రం అలానే ఉందని అన్నారు. బీజేపీ మాత్రమే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు. బీజేపీ అభ్యర్థులు గేలిస్తే ప్రశ్నించే గొంతుకగా శాసనమండలిలో ఉంటారన్నారు. బీఆర్ఎస్ పార్టీ శాసనమండలిని నిర్వీర్యం చేసిందని వ్యాఖ్యలు చేశారు. అసలు శాసనమండలి ఉందా లేదా అన్న అనుమానం కలిగేటట్టు బీఆర్ఎస్ వ్యవహరించిందన్నారు. హైదరాబాద్‌లో నిరుద్యోగుల వద్దకు వచ్చి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కేంద్రం పీఆర్సీ ప్రకటించినా రాష్టంలో మాత్రం ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు. రాబోయే రోజైల్లో కొత్త ఇంటర్నేషనల్ స్కూల్ మాట దేవుడేరుగు ఉన్న స్కూళ్లకు రంగులు వేయలేని పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్, బీఆర్ఎస్ దెబ్బతీశాయని దుయ్యబట్టారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ మెగా టెక్స్ టైల్ పార్క్, కరీంనగర్ యూరియా ఫ్యాక్టరీ, ఎన్టీపీసీలో విద్యుత్ ఉత్పత్తి అంతా బీజేపీ హయాం లోనే జరిగిందని తెలిపారు. రైతులకు సబ్సిడీతో ఎరువులు అందిస్తున్నది మోడీ ప్రభుత్వమని స్పష్టం చేశారు. ల్గ÷తులకు గిట్టుబాటు ధర కల్పించింది మోడీ అని అన్నారు. 2014లో మోడీ ప్రధాని కాక ముందు 3 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేస్తే ఇప్పుడు 26 వేల కోట్లతో తెలంగాణ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. 'కేంద్రం ఏం చేసింది అంటూ మాట్లాడుతున్నారు. కేసీఆర్, రేవంత్ కలిసి వస్తే రండి. పదేళ్ళలో మోడీ ప్రభుత్వం ఏం చేసిందో చూపిస్తాం. గ్రామ పంచాయితీలకు రాష్టం నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. హరీష్ రావు, కేటీఆర్ కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమా' అంటూ సవాల్ విసిరారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీకి ప్రధాని మోడీ వస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకున్నారని మండిపడ్డారు. రాబోవు అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుండు సున్నా మాత్రమే వస్తుందన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ ఓటమి ఖాయమన్నారు. తెలంగాణలో అధికారంలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే అంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను మీడియాకి వివరించారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే కాంగ్రెస్ అరాచకాలను మండలిలో ప్రస్తావించి ఎండగడతాం అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పాటు పడతారని అన్నారు. మీడియా సమావేశంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు గారు, ఓఒఅ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్కా కొమురయ్య, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాజేశ్వర్ రావు దేశ్ పాండే, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణలో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. కాగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన కీలక ఘట్టం నిన్నటితో ముగిసింది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పక్రియలో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. ఈ నెల 27న పోలింగ్ జరుగనన్నది. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ఇక ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీజీపీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

# గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దు

(మొదటి తరువాయి)

తీరుపై హరీష్ రావు మండిపడ్డారు. జీహెచ్ఎంసీ డంప్‌యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ శుక్రవారం గుమ్మడిదలలో గత కొన్ని రోజులుగా స్థానికులు చేస్తున్న ఆందోళనకు మాజీ మంత్రి మద్దతు తెలుపుతూ.. సంఘీభావంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు తెచ్చి మా నెత్తిన వేయకండి అంటే మొండిగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. పర్యావరణం దెబ్బతింటదని, నర్సాపూర్ చెరువు కలుషితం అవుతుందని.. ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయనే వద్దు అంటే పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు గతంలోనే ఈ పనులను ఆపామని చెప్పుకొచ్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వెళ్తోందన్నారు. రేవంత్ రెడ్డి ఎమ్జ్గ÷న్సీ లెక్క చేస్తున్నారని విమర్శించారు. వందల మందిని ఎత్తుకొని పోయి పోలీసు స్టేషన్లలో పెడుతున్నారని.. రాత్రికి రాత్రి పనులు చేసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి దుర్మార్గంగా ప్రవర్తించడం సరికాదన్నారు. గుమ్మడిదల రైతులు అందరికీ ఆదర్శమని.. బంగారం వంటి పంటలు పండిస్తారని తెలిపారు. తక్షణమే డంపు యార్డు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి వచ్చాక లగచర్ల బూములు గుంజుకున్నారని..న్యాల్కల్‌లో పచ్చటి పొలాలు గుంజుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గుమ్మడిదలను మరో లగచర్ల చేయకండని రేవంత్ రెడ్డిని హెచ్చరిస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యం అన్నారని.. ఇందిరమ్మ కాలం నాటి ఎమ్జ్గ÷న్సీని తలపిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ఊళ్లలో మంది ఎంత మంది ఉంటే అంత మంది పోలీసులను పెట్టారని.. ఓట్లేసిన పాపానికి ప్రజలను మోసం చేశారంటూ మండిపడ్డారు.

# పెద్దగట్టు జాతరకు రంగం సిద్దం

(మొదటి తరువాయి)

ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.సూర్యాపేట జిల్లా పెద్దగట్టులో లింగమంతులస్వామి జాతర పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ జాతరకు 20 లక్షల మందికిపైగా భక్తులు రానున్నారు. రూ.5 కోట్లతో రహదారుల మరమ్మతులు, గుట్టపై నుంచి వచ్చే మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీల పనులు చేపట్టారు.. గుట్టపై చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. 21 శాఖల జిల్లా అధికారుల కోసం గుట్ట కింద పందిళ్లతో ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడికి వచ్చే ప్రముఖుల కోసం అతిథి గృహాన్ని సిద్ధం చేశారు. గుట్టపై ఎక్కడపడితే అక్కడ జంతుబలి చేయకుండా ప్రత్యేకంగా షెడ్డును నిర్మించారు. గుట్టపై జంతువుల రక్తాన్ని శుభ్రంచేసే యంత్రాన్ని సిద్ధం చేశారు. ప్రమాదకరంగా ఉన్న చెరువుకట్టకు కర్రలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. తలనీలాలు సమర్పించిన భక్తులు స్నానం చేసేందుకు గుట్ట కింద కోనేరుతోపాటు గుట్టపైన షవర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న శాశ్వత మరుగుదొడ్లతోపాటు తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పెద్దగట్టు జాతర సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈనెల16న జాతర ప్రారంభం కానుండగా 16,17,18 తేదీల్లో హైదరాబాద్ - విజయవాడ 65వ జాతీయ రహదారిపై నుంచి వెళ్లే వాహనాలను నార్కెట్ పల్లి మీదుగా దారి మళ్లించనున్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం పోలీసులు నాలుగు చోట్ల ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్‌కోసం మొత్తం 25 ఎకరాలు సేకరించి చదును చేస్తున్నారు. సూర్యాపేట మీదుగా పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తుల వాహనాలు హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి రామకోటి తండాకు వెళ్లే మార్గంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. గరిడేపల్లి, పెన్‌పహాడ్ నుంచి దురాజ్‌పల్లి నుంచి వచ్చే భక్తుల వాహనాలను పాత కలెక్టరేట్ కార్యాలయం వెనుక కేటాయించిన స్థలంలో పార్కింగ్ కు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే వీఐపీ వాహనాలను పెద్దగట్టు తూర్పు మెట్లకు ఎదురుగా ఉన్న స్థలంలో పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు.

# స్థానిక ఎన్నికలే లక్ష్యంగా రాజకీయాలు

(మొదటి తరువాయి)

ఇందులో అన్ని పార్టీలది బిసి దారి కావడం గుర్తించాలి. దీంతో రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అన్ని పార్టీలు ప్రధానంగా బీసీ, వర్గీకరణ అంశాలపై దృష్టి పెడుతున్నాయి. రాష్ట్రమంతా కులగణన చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే తప్పులతడకగా మారిందని బిజెపి, బిఆర్ఎస్‌లు విమర్శిస్తున్నాయి. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ఆయన మొత్తం బిసి గళాన్ని ఎత్తుకున్నారు. బీసీ నేతలు ఆర్. కృష్ణయ్య.. ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, తీన్మార్ మల్లన్న కూడా బీసీ జపం చేస్తున్నారు. బీసీ ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా ఎత్తుగడలు వేస్తున్నారు. బీసీల విషయంలో వీరిని ఆయా పార్టీలు వ్యూహాత్మకంగా ముందుకు నడిపిస్తున్నాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తున్నది. ఎమ్మెల్సీ కవిత బిసి నినాదంతో రాష్ట్రంలో పర్యటనలు చేస్తున్నారు. బిసిలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని ఎలుగెత్తుతున్నారు. అందుకే స్థానిక ఎన్నికల్లో 'బీసీ' అంశమే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్లేందుకు పార్టీలన్నీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. బీసీల అంశాన్ని కాంగ్రెస్ తనకు అనుకూలంగా మలుచుకుంటే .. బీఆర్ఎస్ మాత్రం అదే అస్త్రాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రయోగి స్తున్నది. కుల గణన పక్రియ కాంగ్రెస్‌కు ప్రతికూలంగా చేసేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నది. కులగణన అంశంపై బీజేపీ పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నది. పార్టీ బలోపేతంతోపాటు రాష్ట్రంలో తమ పార్టీ పాగా వేసేలా వ్యూహాత్మక ఎత్తుగడ వేస్తున్నది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీనే సీఎం చేస్తానని ఇప్పటికే ప్రకటించగా.. ఇక రాష్ట్ర అధ్యక్ష పదవిని సైతం బీసీకే ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. గతంలో బీజేపీ స్టేట్ చీఫ్ గా బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్ను÷- నియమించిన విషయాన్ని గుర్తు చేస్తున్నది. త్వరలో ప్రకటించబోయే స్టేట్ చీఫ్ కూడా బీసీ వ్యక్తే అనే సంకేతాలు ఇచ్చింది. కుల గణనపై చర్చలో భాగంగా బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా బీసీ జనాభాను తక్కువ చేసి చూపించిందని ఆరోపించారు. దీంతో బీసీల నుంచి మద్దతు లభిస్తుందని ఆ పార్టీ భావిస్తున్నది. పార్టీ లైన్‌కు భిన్నంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీ అంశాన్ని ఎత్తుకున్నారు. ఏడాది క్రితమే యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఏర్పాటు చేసి బీసీ సంఘాలను ఏకం చేసే ప్రయత్నం చేశారు. తరచూ వారితో సమావేశమవుతూ కాంగ్రెస్ 42శాతం హామీపై ఒత్తిడి తేవాలని దిశానిర్దేశర చేశారు. బీసీ సంఘాలతో పలుమార్లు భేటీ అయ్యారు.

# సంపాదకీయం

## జనాభాకు తగ్గట్లుగా వస్తూత్పత్తి ఏదీ ?!

ద్రవ్యోల్బణం అరికట్టడానికి...దిగుమతులపై సుంకాలు తగ్గేలా చేయడానికి ముందుగా మన విదేశాంగ విధానం సమీక్షించుకోవాలి. దేశంలో వస్తూత్పత్తి పెరిగేలా చేఉకోవడంలో మనం చైనా నుంచి నేర్చుకోవాలి. వియత్నాం,క్యూబా, కొరియా లాంటి దేశాలు కూడా ప్రపంచంతో పోటీపడగలిగేలా వస్తూత్పత్తిలో ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికీ మనం ఎలక్ట్రానిక్ గూడ్స్ విషయంలో ప్రపంచ దేశాలపైనే ఆధారపడి ఉన్నాం. గూగుల్ సిఇవో, మైక్రోసాఫ్ట్ సిఇవోలు మనవారే ఉన్నా..ఈ రంగంలో మనం అంతగా రాణించడం లేదు. దేశీయంగా మన ఉత్పత్తులను పెంచుకుని మనం సుంకాలు విధించే స్థితిలో ఉంటే..అవి ప్రపంచ దేశాలకు అవసరమైతే మన డిమాండ్ పెరుగుతుంది. మేకిన్ ఇండియా, ఓకల్ ఫర్ లోకల్ వంటి నినాదాలు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదు. దేశంలో మానవనరులు విపరీతంగా ఉన్నాయి. జనాభా 140 కోట్లు దాటి చైనాను మించి పోయాం. చైనా లాగా వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో మనం ముందుకు పోవాలి. అందుకు అనుగుణంగా నిర్ణయాలు, ప్రోత్సాహకాలు అసవరం. మనదగ్గర పండే పంటలకు గిట్టుబాటు ధరలతో పాటు, ఎగుమతులు చేసుకునేలా సరళీకరణ విధానాలు రావాలి. అప్పుడే బియ్యం, మిర్చి, పత్తి వంటివి ఎగుమతి కాగలవు. అలా మన వస్తువులకు సుంకాలను మనమే విధించగలం. ఇప్పుడు అమెరికా సుంకాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మనకు అవసరమున్న వస్తువులనే దిగుమతి చేసుకుంటే సుంకాల బాధతో పాటు, విదేశీమారకం బాధ తప్పుతుంది. కానీ దేశంలో ఇన్నేళ్లయినా ఈ విషయంలో మనం స్పష్టతతో లేమా అన్న అనుమానం కలుగుతోంది. అందుకే విదేశాలు ముఖ్యంగా అమెరికా లాంటి దేశాలు తీసుకునే నిర్ణయాలతో మన ఆర్థిక వ్యవస్థ, మార్కెట్లు ఒడిదుడుకులకు గురవుతున్నాం. చైనాలో అలాంటి పరిస్థితి మాత్రం కానరావడం లేదు. అందుకే అమెరికా అధ్యక్షుడిగా గెలిచిన డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో మన దేశంలోని సామాన్యులందరిపై ప్రభావం పడుతున్నది. సుంకాలు పెంచుతామని హెచ్చరించారు. ఇటీవల ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాలతో డాలర్ క్రమంగాబలపడుతున్నది.అదే క్రమంలో మన రూపాయి మరింత బలహీన పడుతోంది. విదేశీ ఇన్వెస్టర్లు ఇండియా నుంచి వేల కోట్లను యూఎస్‌కు తరలించుకుపోతుండడంతో మన స్టాక్‌మార్కెట్లు కుదేలవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్రమంగా పతనమై.. మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల రేట్లు పెరుగు తున్నాయి. దీంతో విదేశీ మరకాల నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా చమురు ధరలు పెరగడం వల్ల నిత్యావసరాల రేట్లు పైకి ఎగబాకుతున్నాయి. ఇలాంటి గందరగోళ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు గోల్డ్ వైపు చూస్తుండడంతో వాటి రేట్లు సైతం అనూహ్యంగా అందనంతగా పెరుగుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే త్వరలోనే డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.100కు, గోల్డ్‌రేట్‌రూ.లక్షకు చేరుతుందని.. దీని వల్ల మనదేశంలోని సామాన్యులపై మరింత భారం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే బంగారం ధరలు చుక్కలు చూపుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రోజురోజుకూ పతన మవుతున్నది. ఇటీవలి కాలంలో వేగంగా పడిపోతున్న రూపాయి మారకం విలువ ఫిబ్రవరి 5న 87.38 ఆల్ టైమ్ కనిష్టానికి చేరింది. గతేడాది నవంబర్6న అమెరికా ఎన్నికల్లో ట్రంప్‌విజయం సాధించడంతో డాలర్ బలపడ్తూ వస్తున్నది. ఇది రూపాయి విలువపై ప్రభావం చూపుతున్నది. నవంబర్ 5న డాలర్‌తో పోలిస్తే రూ.84.16 గా ఉన్న రూపాయి విలువ క్రమంగా తగ్గుతూ డిసెంబర్19న 85 మార్క్ చేరింది. ట్రంప్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు స్వీకరించాక దూకుడుగా తీసుకుంటున్న పలు నిర్ణయాలతో కేవలం నెలన్నర వ్యవధిలో డాలర్‌విలువ 2 రూపాయల మేర పెరిగింది. ఇటీవల ట్రంప్.. కెనడా, మెక్సికో దేశాల వస్తువులపై 25 శాతం, చైనా వస్తువులపై 10 శాతం దిగుమతి సుంకం విధించారు. దీంతో అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితులు నెలకొని డాలర్ బలపడుతుండగా, డాలర్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉన్న ఆసియా కరెన్సీలు పతనం అవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ రాణిస్తుండడం, అక్కడ బాండ్లపై మంచి రిటర్న్లు వస్తుండటంతో మన దగ్గర విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్తున్నాయి. మన స్టాక్ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్లు జనవరి నుంచి ఇప్పటివరకు రూ.68,441 కోట్లకు పైగా వెనక్కి పట్టుకు పోయారు. దీని వల్ల స్టాక్ మార్కెట్లు కుదేలవుతూ లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోతోంది. డాలర్లకు డిమాండ్ పెరిగి, రూపాయి బలహీనపడుతోంది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు దారుణంగా పెరిగిపోతున్నాయి. దీంతో దిగుమతులు ఖరీదవుతున్నాయి. మరోపక్క ద్రవ్యోల్బణం పెరగడంతో కార్పొరేట్ సంస్థల ఆదాయాలు, లాభాలు తగ్గుతున్నాయి. ఆర్థిక కార్యకలాపాలు మందగించి, ఉద్యోగాల్లో కోత, సరకుల సరఫరా తగ్గడం వంటి సవాళు ఎదురవుతున్నాయి. అటు విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజులు, ఖర్చుల మొత్తం పెరిగి తల్లిదండ్రులు తల పట్టుకుంటున్నారు. ద్రవ్యోల్బణం పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి క్షీణించడంతో ముున్ముందు నిత్యావసరాల ధరలు మరింత పెరుగుతాయనే భయాందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో దేశీయంగా మానవవనులను ఉపయోగించుకోవాలి. ఏదో ఒకపనిద్వారా ప్రపంచానికి అవసరమైన వస్తువుల ఉత్పత్తిపై దృష్టి సారించాలి.


# మూడోకన్ను తెరిచిన మధ్యతరగతి



నా స్నేహితురాలు ఒకరు పది సంవత్సరాల క్రితం (ఫిబ్రవరి 2015) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి ఓటు వేశారు. ఆమె మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీకి గట్టి మద్దతుదారు. 2014 సార్వత్రిక ఎన్నికలలో ప్రప్రథమంగా భారతీయ జనతా పార్టీకి ఆమె ఓటు వేశారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ పాలన నానా కుంభకోణాలకు తావివ్వడం పట్ల ఆగ్రహంతో ఆమె బీజేపీ వైపు మొగ్గారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ఆమె ఆప్‌కు ఓటు వేశారు. ఎందుకని? ఆమె ఇలా సమాధానమిచ్చారు: 'మోదీ, కేజ్రీవాల్ ఇరువురినీ నేను ఇష్టపడతాను. ఇరువురూ స్వయం కృషితో ఉన్నతస్థానాలకు ఎదిగిన నాయకులు. మార్పు తీసుకువస్తామని నమ్మకంగా హామీ ఇస్తున్నారు'.సరే, ఆ ఫిబ్రవరి నుంచి ఈ ఫిబ్రవరికి వద్దాం. ఈ సారి బీజేపీకి ఆమె ఓటు వేశారు గత పదేళ్లుగా 'ఢిల్లీ ఫార్ములా' (ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్) ప్రకారం ఆమె ఓటు వేస్తూ వచ్చారు: కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్న ఆలోచన ఆమెకు లేనే లేదు. గెలిచే అవకాశాలు ఏ మాత్రం లేవు గనుక కాంగ్రెస్‌కు వేసే ఓటు పూర్తిగా వ్యర్థమయ్యే ఓటే అన్నది ఆమె అభిప్రాయం. మరి ఈసారి ఆప్‌కు ఓటు వేయకూడదని ఎందుకు నిర్ణయించుకున్నారు? 'ఆప్ పాలన నాకు తీవ్ర ఆశాభంగం కలిగించింది. నేనూ ఒకప్పుడు ఆప్ వలంటీర్‌గా పని చేశాను. ఇప్పుడు ఆప్ ఏమీ భిన్నమైన పార్టీ కాదని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. కేజ్రీవాల్ మరొక రాజకీయవేత్త మాత్రమే' అని ఆమె సమాధానమిచ్చారు.ఢిల్లీ సంపన్న మధ్య తరగతి వర్గానికి ప్రతినిధి నా స్నేహితురాలు. ఆమె వోటింగ్ ప్రాధాన్యాలలో, 2025 ఎన్నికలల్లో ఆప్, అరవింద్ కేజ్రీవాల్ ఎందుకు ఓడిపోయారన్న దానికి కీలక కారణమున్నదని మీరు గ్రహించి ఉంటారు. ఢిల్లీ ఉజ్వల రాజకీయ తారగా కేజ్రీవాల్ మొట్టమొదట మెరిసినప్పుడు సంప్రదాయ రాజకీయవేత్తకు ఆయన పూర్తిగా భిన్నమైనవాడు అనే భావన ప్రజల మనసుల్లో నాటుకు పోయింది. ఐఐటి పట్టభద్రుడు, సమాచార హక్కు కార్యకర్త, మెగాసెసే పురస్కార గ్రహీత, ఇండియా అగనెస్ట్ కరప్షన్ సంస్థాపక సభ్యుడు అయిన కేజ్రీవాల్ అన్నిటికీ మించి 'ఆశాభావ' రాజకీయాలకు ప్రతినిధి అని దేశ ప్రజలు భావించారు, గౌరవించారు. నరేంద్ర మోదీ 'అచ్ఛే దిన్' (మంచి రోజు) తీసుకువస్తానని హామీ ఇవ్వగా ప్రజా జీవితంలో అవకాశవాద, అవినీతికర, జవాబుదారీతనం తూకుండా వ్యవహరిస్తున్న రాజకీయవేత్తలకు ప్రజా జీవితంలో స్థానం లేకుండా చేస్తానని కేజ్రీవాల్ వాగ్దానం చేశారు. బీజేపీ హిందుత్వ 'మతతత్వ' పార్టీగా, కాంగ్రెస్ కుటుంబ%-%కేంద్రిత, ప్రజలతో సన్నిహిత సంబంధాలు లేని కులీనుల ప్రాబల్యమున్న పార్టీగా ప్రజలు భావిస్తున్న కాలంలో అరవింద్ కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీని ఏర్పాటు చేశారు. సరికొత్త, ఎటువంటి చరిత్ర భారం లేని పార్టీగా ఆప్ ప్రజల దృష్టికి వచ్చింది. మధ్య తరగతి విద్యావంతులు ఆప్ పట్ల ఆకర్షితులయ్యారు. దేశ పరిస్థితులను సమూలంగా మార్చివేసేందుకు ఆ పార్టీ తమకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వగలదని ఆశించారు. స్వల్పకాలంలోనే ప్రజల సంపూర్ణ మద్దతుతో ఆప్ అధికారానికి వచ్చింది. అయితే ఆప్ 'భిన్నమైన రాజకీయ పార్టీ' అన్న నమ్మకం గత పదేళ్లుగా క్రమంగా సడలిపోయింది. తొలుత ఆప్ పట్ల ఆకర్షితులయిన మధ్య తరగతి వారే ఇప్పుడు ఆ పార్టీని అధికారం నుంచి తొలగించారు. ఢిల్లీలో ఎల్లెడలా చెత్త కొండలు, రోడ్ల మీద పారుతున్న మురికి నీరు మొదలైన సమస్యలకు పరిష్కారం లభించగలదనే ఆశాభావంతోనే వారు ఆప్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారు. 2025 ఎన్నికల తీర్పును మధ్యతరగతి ప్రజల ఆగ్రహ 'ప్రభంజనం'కు అంతిమ దృష్టాంతంగా చెప్పవచ్చు. ఇప్పుడు ఒక ప్రధాన ప్రశ్నను తరచి చూద్దాం: అరవింద్ కేజ్రీవాల్ ఒక ప్రజా నాయకుడుగా తనను తాను పునరావిష్కరించుకోగలరా? తన రాజకీయ పునరాగమనాన్ని సుసాధ్యం చేసే సానుకూలతలను సృష్టించుకోగలరా? నైతిక విలువలకు నిబద్ధమైన నాయకుడు అనే యశస్సు తుడిచిపెట్టుకుపోయినందున కోల్పోయిన వైభవాన్ని పునః సాధించుకునేందుకు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పోరాడవలసి ఉంటుంది, తప్పదు. రాజకీయ సమస్యలు, సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు బీజేపీ, కాంగ్రెస్‌కు ఉన్నట్టుగా ఆప్‌కు పటిష్ఠ సంస్థాగత నిర్మాణం లేదు అధికారాన్ని ఆశించి మాత్రమే ఆప్‌లో చేరినవారు పార్టీ ఫిరాయించేందుకు వెనుకాడరు. వచ్చే కొద్ది నెలల్లో చీలికలు, ఫిరాయింపులతో ఆప్ బలహీనపడే అవకాశం ఎంతైనా ఉన్నది. అసలు కేజ్రీవాల్ నాయకత్వానికే సవాళ్లు ఎదురవ్వవచ్చు. సందేహం లేదు, ఆప్ అధినేతకు పరిస్థితులు అన్నీ ప్రతికూలంగా ఉన్నాయి. అయినప్పటికీ 54 ఏళ్ల కేజ్రీవాల్ రాజకీయ జీవితం సమాప్తమయిందని ఎవరైనా భావిస్తే అది తొందరపాటే అవుతుంది. పూర్తిగా పొరపడడమే కాగలదు. ఢిల్లీ ప్రజా తీర్పు, బ్రాండ్ కేజ్రీవాల్‌ను మధ్యతరగతి ప్రజలు తిరస్కరించిన వాస్తవాన్ని పూర్తిగా ప్రతిబింబించి ఉండవచ్చు గానీ, కిందిస్థాయి అల్పాదాయ వర్గాలవారు ఆయన పాలనను, రాజకీయ శైలిని సంపూర్ణంగా సమర్థించారని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఆప్ 'చీపురుకట్ట' ఒక నిర్దిష్ట వర్గ అస్తిత్వానికి ఒక రాజకీయ చిహ్నంగా భాసిల్లింది, ఇక ముందూ తప్పక భాసిల్లుతుంది. కాకపోతే ఓటమిలో సైతం ఆప్‌కు 44 శాతం ఓట్లు ఎలా వస్తాయి? ఢిల్లీ ఓటర్లలో కేజ్రీవాల్‌కు మద్దతు ఇంకా గణనీయంగా ఉన్నదనేది కొట్టివేయలేని వాస్తవం ఓటుహక్కును వినియోగించడంలో కాసుల లబ్ధికి తొలి, మలి, తుది ప్రాధాన్యమిస్తున్న బేరసారాల ధోరణి ఓటర్లలో అంతకంతకూ పెరిగిపోతోన్న ప్రస్తుత రాజకీయ వాతావరణంలో పేదలకు మౌలిక వసతులు సమకూర్చేందుకు కేజ్రీవాల్ చేసిన ప్రయత్నాలు అంత తేలిగ్గా విస్మరణకు గురవుతాయా? ఉచిత విద్యుత్, ఉచిత నీరు, మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం ఇత్యాదులను సామాన్య ప్రజలు తేలిగ్గా విస్మరించరు. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని ఇక నుంచీ కేజ్రీవాల్‌తో బీజేపీ చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉన్నది. ఆయన్ని అణచివేయడమే లక్ష్యంగా పెట్టుకుంటే దానివల్ల నష్టపోయేది తామేనన్న విషయాన్ని బీజేపీ నాయకులు గుర్తించాలి. కక్ష సాధింపు చర్యలు కేజ్రీవాల్ మళ్లీ వీధుల్లోకి వచ్చే అవకాశాన్ని కల్పిస్తాయి. 2024లో ఢిల్లీ మద్యం కుంభకోణంలో మొదటిసారి అరెస్టయి జైలుకు వెళ్లిన సందర్భంలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయకుండా పదవిలో కొనసాగడం ద్వారా కేజ్రీవాల్ పెద్ద తప్పుచేశారు.

# అగ్రదేశాల కురచ బుద్ధి

తమ పనులు కచ్చితంగా, త్వరగా, నాణ్యంగా జరగటానికి అవసరమైన పనిముట్లను రూపొందించుకునే ప్రస్థానంలో మానవులు సాధించిన ప్రగతి అద్వితీయం. తొలినాళ్ల వేట ఉపాయాలు మొదలుకొని నేడు అత్యున్నత శాస్త్ర సాంకేతికత పరిజ్ఞానంగా చెప్పుకుంటున్న కృత్రిమ మేధ (ఎఐ) దాకా ఆవిష్కరణల పథం సాగుతూనే ఉంది. పనిముట్ల మీద ఎవరి ఆధిపత్యం ఉంటుందో %-% సమాజం మీద వాళ్ల పెత్తనమే చెల్లుబాటు అవుతుంది. అత్యంత వేగవంతమైన, ప్రభావశీలమైన కృత్రిమ మేధ మీద ఆజమాయిషీ, అదుపు, అందుకు అవసరమైన విలువల ప్రతిష్టాపన, సర్వజనీన శ్రేయస్సును కోరే విచక్షణ ఎలా ఉండాలి? ఏయే ప్రామాణికాలతో ఆ ప్రక్రియ సాగాలి? దేశాల మధ్య పరస్పర సహకారం, పారదర్శకత ఎలా ఉండాలి? ఇత్యాది కీలకమైన అంశాలపై చర్చించి, సమాధానాలు, పరిష్కారాలు చూపాల్సిన ఎఐ పారిస్ శిఖరాగ్ర సదస్సు పూర్తిస్థాయి ఫలితాలు ఇవ్వకుండానే ముగియటం నిరాశాజనకం. సదస్సు తీర్మానంపై భారత్, చైనా సహా 60 దేశాలు సంతకాలు చేసినప్పటికీ– అమెరికా, బ్రిటన్ దానికి దూరంగా ఉండడం వాటి పెత్తందారీ వైఖరికి నిదర్శనం. ఎఐ వంటి విస్తృత సాంకేతిక పరిజ్ఞానంపై తమ పట్టు సడలిపోకూడదన్న స్వార్థ బుద్ధికి సంకేతం. విద్య, వైద్యం, పరిశోధన వంటి అనేక రంగాలను, శాస్త్ర సాంకేతిక అంగాలను విశేషంగా ప్రభావితం చేయగలిగిన కృత్రిమ మేధ అన్ని వైపులా పదునున్న కత్తి. వినియోగించేవారి ఉద్దేశాలను బట్టి ఫలితాలు, పర్యవసానాలూ ఉంటాయి. ప్రోది చేయబడిన సమాచారాన్ని ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా లూటీ చేయగలిగిన మతలబు ఇప్పుడున్న మెయిల్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఆధార్ వంటి డేటా అనుసంధాన ప్రక్రియల్లో పుష్కలంగా ఉంది. గూగుల్ వంటి సెర్చి ఇంజన్లలో మన అన్వేషణ, గూగుల్ మ్యాపుల్లో మన సందర్శనల సమాచారం ఆధారంగా మన ఇష్టాయిష్టాలను, అలవాట్లను కార్పొరేట్ వాణిజ్య సంస్థలు సులభంగా గుప్పిట పట్టగలుగుతున్నాయి. తమ వ్యాపార ఉత్పత్తుల ప్రచారాన్ని మన మీద కుమ్మరించి, క్రమేణా




వినియోగదారుల జాబితాలోకి బదలాయిస్తున్నాయి. ఇలాంటి సాంకేతిక వ్యవస్థ కన్నా అనేక వందల రెట్ల సామర్థ్యాన్ని, వేగాన్ని కలిగిన ఎఐ వేదికలు దుర్వినియోగం కావన్న గ్యారంటీ ఏముంది? వ్యక్తిగత గోప్యత, దేశ భద్రత, భిన్నాభిప్రాయాలకు అవకాశం కచ్చితంగా దొరుకుతుందన్న భరోసా ఏమిటి? ఎఐ పరిజ్ఞానం మీద కొన్ని దేశాలకో, సంస్థలకో గుత్తాధిపత్యం ఏర్పడితే తలెత్తే పరిణామాలకు ఎవరిది బాధ్యత? ఇలాంటి భయాందోళనలు, సందేహాలూ ముప్పిరిగొంటున్న సమయాన విస్తారమైన చర్చలూ, ప్రజాస్వామ్యబద్ధమైన నియమ నిబంధనలు చాలా అవసరం. వాటి మీద ప్రపంచ దేశాల ఏకీభావం చాలా ముఖ్యం. కానీ, సంతకానికి నిరాకరించటం ద్వారా అమెరికా, బ్రిటన్ దేశాలు ఐక్య కార్యాచరణకు అడ్డంకిగా మారాయి. ప్రపంచ ఉమ్మడి లక్ష్యాల నుంచి, తన బాధ్యత నుంచి వైదొలగిపోతూ అమెరికా ఈ వేదిక మీదా తన ఏకపక్ష వైఖరిని ప్రదర్శించటం ఆందోళనకరం. కృత్రిమ మేధ ఆవిష్కరణకు, అభివృద్ధికి వేల కోట్ల రూపాయల పెట్టుబడి, ఏళ్ల తరబడిన కృషీ అవసరమని అమెరికా, బ్రిటన్ వంటి అగ్ర దేశాలూ, కార్పొరేట్ కంపెనీలూ ప్రపంచానికి బోధిస్తే– కొద్ది పెట్టుబడితోనే ఆ పనిని సాకారం చేయొచ్చని చైనా ఇటీవల చాటి చెప్పింది. డీప్‌సీక్ ఆవిష్కరణ ద్వారా సంచలనం కలిగించింది. మెయిల్ మొదలుకొని అన్ని రకాల డిజిటల్ వేదికలను సొంతంగా నిర్మించుకున్న చైనా తన సొంత ముద్రను కాపాడుకుంటోంది. సమాచార సేకరణ, అమ్మకం పెద్ద వ్యాపారంగా మారిన ప్రస్తుత కాలంలో– సొంత సమాచార వ్యవస్థల నిర్మాణం, నిర్వహణ, నియంత్రణలో మనమూ ముందడుగు వేయాలి. గతాన్ని, చరిత్రను వక్రీకరించే సాధనంగా టెక్నాలజీని వాడడమే గొప్పనుకునేలా మన పాలకులు యువతరాన్ని సంకుచిత కూపంలోకి నెడుతున్నారు. శాస్త్రీయ విద్యను, ఆధునిక దృక్పథాన్ని, ప్రజాస్వామిక వాతావరణాన్ని పెంపొందించటం ద్వారా మాత్రమే శాస్త్ర సాంకేతిక రంగాల్లో విజయాలు సాధించగలం. విచక్షణ, వివేచన, మానవీయతతో కూడిన సమున్నత, సమానత్వ భావనలతోనే కృత్రిమ మేధకు అర్థమూ పరమార్థమూ చేకూరతాయి. ఆ దిశగా పాలకులు ఆలోచించాలి.

# జడ్జి పై చెప్పు విసరడం అత్యంత దురదృష్టకరం








**ప్రజా స్వేచ్ఛ.. రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జి పై జరిగిన దాడిని తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి గారు మరియు అన్ని జిల్లా మండల కోర్టుల ముందు ఉద్యమ న్యాయవాదులు కన్వీనర్ కొకన్వీనర్లు తీవ్రంగా ఖండించారు కోర్టు హాలులో జడ్జిపై చెప్పు విసరడం అత్యంత దురదృష్టకరమైన దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు పోలీస్ సిబ్బంది వైఫల్యం వల్లే జడ్జిపై దాడి జరిగిందని ఆరోపించారు ఇలాంటి సంఘటనలు న్యాయవాదుల పైన కూడా ఎన్నోసార్లు జరిగిందని అన్నారు . ఇప్పుడు న్యాయమూర్తి పైన జరిగింది ఇలాంటి ఘటనలు న్యాయవ్యవస్థకి మాయని మచ్చ అని అన్నారు జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం ఉదయం తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఆధర్యంలో అన్ని జిల్లా మండల కోర్టులో విధులు బహిష్కరించారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదుల అందరికీ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ మరియు న్యాయమూర్తులకు కూడా పరిరక్షణ చట్టం కావాలని డిమాండ్ చేశారు.

**తరిగొప్పుల మహేందర్ అడ్వకేట్**

తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి..



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# కుల గణన సర్వే నా కోసం నా పదవి కోసం చేయలేదు

**-సీఎం రేవంత్ రెడ్డి!**

**-నేను ఆఖరి 'రెడ్డి' ముఖ్యమంత్రిని అయినా ఫర్వాలేదు**

**-కార్యకర్తగా మిగిలిపోయేందుకు సిద్ధం: రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్:ఫిబ్రవరి 14ప్రజా స్వేచ్ఛ.**

నేను ఆఖరి 'రెడ్డి' ముఖ్యమంత్రిని అయినా ఫర్వాలేదు, మా నాయకుడు ఇచ్చిన మాట నిలబెట్టేందుకు క్రమశిక్షణ కలిగిన ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకున్నా ఇది నా నిబద్ధత, కుల గణన సర్వే నా కోసం నా పదవి కోసం చేయలేదు త్యాగానికి సిద్ధపడే కులాల లెక్కలు పక్కాగా తేల్చాం . మా నాయకుడి ఆదర్శం నిలబట్టేందుకు నేను కార్యకర్తగా మిగిలేందుకు సిద్ధం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.రాహుల్ గాంధీ ఇచ్చిన మాట మేరకు కుల గణన చేపట్టామన్న రేవంత్ రెడ్డి కులాల లెక్కలను పక్కాగా తేల్చామని, స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన కుల గణన, ఎస్సీ వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రజెంటే షన్‌లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నా కోసమో, నా పదవి కోసమో కుల గణన చేయలేదన్నారు. కులాల లెక్కలను పక్కాగా తేల్చామని ఆయన అన్నారు. ఇదీ తన నిబద్ధత అన్నారు. కొందరు ఆరోపి స్తున్నట్లుగా కుల గణనలో ఎలాంటి పొరపాటు జరగలేదన్నారు. కుల గణన సర్వేను

**తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి**



తప్పుబడితే బీసీలు శాశ్వతంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కుల గణన జరగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తమ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటులో నిలదీశారని ఆయన అన్నారు. కుల గణన సర్వే జరగకూడదని మోదీ, కేసీఆర్ కలిసి కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. మోదీ పుట్టుకతో బీసీ కులస్థుడు కాదని, ఆయన ముఖ్యమంత్రి అయ్యాక గుజరాత్‌లో తన కులాన్ని బీసీలోకి తీసుకువచ్చారని ఆయన అన్నారు. మోదీ పేరుకే బీసీ అని, వ్యక్తిత్వం మాత్రం అగ్ర కులమే అని విమర్శించా రు.కుల గణన జరిగితే చట్ట ప్రకారం రిజర్వేషన్లు సాధిం చుకోవచ్చని అన్నారు. అధికారిక లెక్కలు ఉంటే బీసీల రిజర్వేషన్లు పెంచాలని సుప్రీంకోర్టు కూడా చెప్పవచ్చని అన్నారు. కుల గణన సర్వే రెండో విడత అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఇళ్ల ముందు మేలుకొలుపు డప్పు కొట్టాలని బీసీ సంఘాలకు పిలుపునిచ్చారు. సర్వేలో పాల్గొనకపోతే సామాజిక బహిష్కరణే శిక్ష అన్నారు.

# పేద విద్యార్థులకు మేము ఎల్లప్పుడూ అండగా ఉంటాం





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ముస్త్యాల ప్రజా స్వేచ్ఛ.**
ముస్త్యాల జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల లో విద్యనభ్యసిస్తున్న తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థులకు కామ్రేడ్ కొంగరి నారాయణ స్మారక విజ్ఞాన సేవా సంఘం ముస్త్యాల ట్రస్టు ద్వారా వీరికి తెల్ల స్కూల్ యూనిఫాం దుస్తులను సేవా భావంతో ట్రస్టు అధ్యక్షులు కొంగరి వెంకట మావో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల సమక్షంలో శు క్రవారం రోజున అందించడం జరిగింది. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో మాట్లాడుతూ ఈ పేద విద్యార్థులకు మేము ఎల్లప్పుడూ అండగా ఉంటామని పట్టుదలతో బాగా చదివి క్రమశిక్షణను అలవర్చుకుంటూ ముస్త్యాల పాఠశాలకు, చదువు చెప్పే గురువులకు, మిమ్ములను కన్న తల్లిదండ్రులకు, మంచి పేరు తేవాలని సమాజంలో మంచి గౌరవంతో ఉత్తములుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రేపాక కుమార్, గుండ్ర రవీందర్, కొంగరి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు

# చిలుకూరు రంగరాజన్ కు సంఘీభావం తెలిపిన షాద్ నగర్ బ్రాహ్మణ సమాఖ్య...!




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 14 ప్రజా స్వేచ్ఛ.**
శ్రీ బాలాజీ దేవాలయం చిలుకూరు పూజారి బ్రహ్మశ్రీ రంగరాజన్ పై జరిగిన దాడికి శుక్రవారం షాద్ నగర్ బ్రాహ్మణ సమాఖ్య చిలుకూరు బయలుదేరి సంఘీభావం తెలిపారు. బ్రాహ్మణ సమైక్య పరిషత్ షాద్ నగర్ నియోజకవర్గం అధ్యక్షులు రాజుల వెంకటేశ్వరరావు సమక్షంలో షాద్ నగర్ టౌన్ అధ్యక్షులు సుజీవన్ కోచగంటి భాను శర్మ, వేణుగోపాలకృష్ణ, పూర్ణచంద్రరావు, మణిపంతులు, రాజగోపాల్, దివ్య సాయి, భరత్, సునీల్ కుమార్, సుదర్శన్ రావు, బ్రాహ్మణ సమాఖ్య మహిళ అధ్యక్షురాలు సంయుక్త, లక్ష్మి పద్మావతి, కమలమ్మ, మాధవి, వీణ మాత, జానకమ్మ, రంగరాజన్ ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంగరాజన్ పై దాడికి పాల్పడిన వారిపై కఠినంగా శిక్ష పడాలని, బ్రాహ్మణ సర్వ సభ్య సంఘాలు కూడా అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం రంగరాజన్ తనపై అభిమానంతో సంఘీభావం తెలిపిన షాద్ నగర్ బ్రాహ్మణ సమాఖ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అమర జవాన్లకు ఘన నివాళి



**గద్వాల జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 14 ప్రజా స్వేచ్ఛ.**
పుల్వామా దాడిలో అమరులైన వీరజవాన్లకు శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో గద్వాలలోని ఎంఎఎల్ డి కళాశాలలో వీర పుల్వామా అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి భాద్యత అని అన్నారు. దేశ సేవలో నేటి యువత ముందుండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర ఉపాధ్యక్షులు నరేష్ పటేల్, రఘువంశీ, సత్యారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, చందు, గణేష్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిపై చెప్పు విసిరిన ముద్దాయి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

-పోక్సో కేసులో ఒక వ్యక్తికి జీవితఖైదు
-తనను దోషిగా ప్రకటించడాన్ని జీర్ణించుకోలేక చెప్పు విసిరిన వైనం
-నేరస్తుడిని చితకబాదిన న్యాయవాదులు

**ప్రజా స్వేచ్ఛ.. రంగారెడ్డి**
హైదరాబాద్ లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. జీవిత ఖైదు పడిన ఓ నేరస్తుడు కోపం తట్టుకోలేక జడ్జి పట్ల దురుసుగా ప్రవర్తించాడు. పోక్సో కోర్టు న్యాయమూర్తిపై చెప్పు విసిరాడు. పోక్సో కేసులో తనను జడ్జి దోషిగా ప్రకటించడంతో జీర్ణించుకోలేకపోయాడు. జడ్జిపై చెప్పు విసిరాడు. జరిగిన ఘటనతో అక్కడున్న వారంతా షాక్ కు గురయ్యారు. కోర్టులో ఉన్న న్యాయవాదులు నేరస్తుడిని పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# ప్రధాని నరేంద్ర మోదీ బీసీ కాదు.. లీగల్లీ కన్వర్టెడ్ బీసీ



-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ సీఎం కేసీఆర్ యూత్ కాంగ్రెస్ నుంచే వచ్చారు
-బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదారాబాద్ప్రజా స్వేచ్ఛ.**
తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అగ్ర రాజకీయ నేతలంతా యూత్ కాంగ్రెస్ నుంచే వచ్చారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సైతం యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడిగా జక్కిడి శివచరణ్ ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హైదరాబాద్ గాంధీ భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శివచరణ్ బాధ్యతలు స్వీకరించారు. హనుమంతరావు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చంద్రబాబు, కేసీఆర్ యూత్ కాంగ్రెస్‌లో పని చేశారని ముఖ్యమంత్రి రేవంత్ గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా అక్కడ్నుంచే వచ్చారని పేర్కొన్నారు. రాజకీయాలకు యూత్ కాంగ్రెస్ అనేది మొదటిమెట్టని ఆయన చెప్పుకొచ్చారు. పదవులు వచ్చినా, రాకపోయినా కాంగ్రెస్ శ్రేణులు మాత్రం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.."తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. పేదల ఆత్మగౌరవం కోసం ఇళ్లు కట్టిస్తున్నాం. డబుల్ బెడ్‌రూమ్ పేరుతో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేశారు. ఆయన మోసం చేశారు కాబట్టే ప్రజలు మనకు అధికారం ఇచ్చారు. స్థానిక సంస్థల్లో యూత్ కాంగ్రెస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు ఇస్తాం. ఫ్లెక్సీలు కట్టి దండాలు పెట్టేవారికి పదవులు రావు. ఢిల్లీ నుంచి కాదు.. గల్లీ నుంచి వచ్చిన వారికే పదవులు ఇస్తాం. దేశంలోనే ఎవరూ చేయనంత రుణమాఫీ తెలంగాణ రైతాంగానికి చేశాం. భూమి లేని వారికీ రూ.12 వేలు ఇస్తున్నాం. 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసి చూపించాం. ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను యూత్ కాంగ్రెస్ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎన్నికల్లో డబ్బుతో ఎవరూ గెలవలేరు. మేము ప్రజాభిమానంతో గెలిచాం. డబ్బులే గెలిపిస్తాయంటే కేసీఆర్‌కు 100 సీట్లు వచ్చి ఉండేవి. కొడితే గట్టిగా కొడతామని కేసీఆర్ అంటున్నారు. కేసీఆర్‌ను కొట్టాలంటే కేటీఆర్, కవిత, హరీశ్‌నే కొట్టాలి. కేసీఆర్‌ను కేటీఆర్ ఓడించారు, కేజ్రీవాల్‌ను కవిత ఓడించింది. కల్వకుంట్ల కుటుంబం అవినీతి చూసే ప్రజలు బుద్ధి చెప్పారు. దేశంలో కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం మాది. కులగణన, ఎస్సీ వర్గీకరణపై పక్కాగా చేసిన మా లెక్కను తప్పంటారా. కేసీఆర్ ఒక్క రోజే సర్వే చేసి కాకిలెక్కలు చూపించారు. చెట్ల మీద విస్తరాకులు కుట్టినట్టుగా గతంలో సర్వే చేశారు. తెలంగాణలో జీవించే హక్కు కేసీఆర్‌కు లేదు. గ్యాంబ్లర్స్ అంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. కులాల లెక్కలు ఎప్పటికీ తేలకూడదనే ఆ పార్టీ నేతలు పన్నాగం పన్నుతున్నారు. కేసీఆర్ లాంటి వాళ్లు తెలిసి, బలిసి సర్వేలో పాల్గొనలేదు. జనాభా లేకపోయినా రావులంతా పదవులు పంచుకున్నారు. బీసీలు ఆ లెక్కలు అడుగుతారనే అడ్డుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన నా కోసం కాదు.. క్రమశిక్షణ కలిగిన సీఎంగా కులగణన చేయిచాం. దొంగ లెక్కలు చెప్పాలనుకుంటే మా కులాన్ని ఎక్కువ చూపించేవాళ్లం. బీసీ కులగణనకు రెండో విడత కూడా అవకాశం ఇచ్చాం. ప్రధాని నరేంద్ర మోదీ బీసీ కాదు.. లీగల్లీ కన్వర్టెడ్ బీసీ. 2002 వరకు మోదీది ఉన్నత వర్గమే. ఆయన గుజరాత్ సీఎం అయ్యాక తన కులాన్ని బీసీల్లో కలిపారు. అన్నీ తెలుసుకునే మోదీ కులం గురించి మాట్లాడుతున్నా. కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును సామాజిక బహిష్కరణ చేయాలని తీర్మానం చేశాం. లెక్కల్లో పాల్గొనాలని కేసీఆర్, కేటీఆర్ ఇళ్ల ముందు డప్పు కొట్టండి" అని అన్నారు..

# బిజినెస్

## వరుసగా ఎనిమిదో రోజు నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**23వేల పాయింట్లకు దిగువకు నిఫ్టీ..!**



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఎనిమిదో రోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 76వేల పాయింట్లు.. నిఫ్టీ 23వేల పాయింట్లకు దిగువన ముగిసింది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో మార్కెట్లు వరుస సెషన్లలో నష్టపోయాయి. దానికి తోడు భారత్ సహా పలు దేశాలపై రెసిప్రోకల్ టారిఫ్‌లను విధిస్తామని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటిస్తున్నారు. ఈ సమయంలోనూ టారిఫ్‌పై చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అమెరికా ప్రెసిడెంట్ వ్యాఖ్యలు దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపాయి. ఫలితంగా శుక్రవారం సైతం మార్కెట్లు నష్టాల్లో కూరుకుపోయాయి.క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 76,388.99 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,483.06 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 75,439.64 పాయింట్లకు చేరింది. చివరకు 199.76 పాయింట్ల నష్టంతో 75,939.21 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 642 షేర్లు లాభాలను నమోదు చేయగా.. 3,200 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీ ప్రస్తుతం ఆల్‌టైమ్ కంటే 13శాతం తగ్గింది. సెన్సెక్స్ గరిష్ఠ స్థాయి నుంచి 12శాతం పతనమైంది. సెన్సెక్స్, నిఫ్టీ 3శాతం పనమయ్యాయి. ట్రేడింగ్‌లో అన్ని రంగాలు సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీలు దాదాపు 3శాతానికిపైగా పడిపోయాయి. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ డిసెంబర్ రికార్డు గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు 21 శాతం తగ్గింది. అయితే, మిడ్‌క్యాప్ సెప్టెంబర్ నాటి గరిష్ట ముగింపు స్థాయి కంటే 19.5 శాతం పడిపోయాయి.

## రికార్డు స్థాయికి బంగారం ధరలు..! ఆభరణాలకు భారీగా తగ్గిన డిమాండ్..!

బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సరికొత్త శిఖరాలను తాకాయి. ఈ క్రమంలో బంగారు ఆభరణాలకు డిమాండ్ 80శాతం వరకు పడిపోయింది. దేశవ్యాప్తంగా ఆభరణాల విక్రేత్రలు అమ్మకాలు తగ్గుతున్నాయని చెబుతున్నట్లుగా ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం దేశంలో పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్నది. అయితే, ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులు ఆసక్తి చూపించడం లేదు. ఫలితంగా కొనుగోళ్లు మందగించాయి. మరో వైపు చైనా డీలర్స్ కొనుగోలుదారులను ఆకర్షించేందుకు డిస్కౌంట్ ఆఫర్స్ ప్రకటించారు.ట్రంప్ నేతృత్వంలోని యూఎస్ సుంకాలు విధిస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య యుద్ధం తప్పదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో పెట్టుబడిదారులు బంగారం పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో పుత్తడి ధరలు అమాంతం పెరుగుతూ వస్తున్నాయి. రికార్డు స్థాయిలో ఔన్స్‌కు 2,942.70 డాలర్లకు చేరింది. అయితే,



చాలామంది వినియోగదారులు వివాహాల సీజన్ నేపథ్యంలో పసిడిని కొనుగోలు చేయాలని భావిస్తున్నారని.. కానీ ధరల పెరుగుదల కారణంగా వెనక్కి తగ్గుతున్నారని ఓ వ్యాపారి పేర్కొన్నారు. ఫోన్ చేసి ధరలు ఎప్పుడు తగ్గుతాయని.. పసిడిని కొనుగోలు చేసేందుకు సరైన సమయం ఎప్పుడో చెప్పాలని పలువురు అడుగుతున్నారని కోయంబత్తూరుకు చెందిన వ్యాపారి ముత్తువెంకట్రామ్ పేర్కొన్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ డేటా ప్రకారం.. 2024లో భారత దేశంలో బంగారం వినియోగం 563.4 మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇది చైనా కంటే ఎక్కువ. చైనాలో 511.4 టన్నుల విక్రయాలు జరిగాయి. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా భారత్ ఉన్నది. ప్రస్తుతం బంగారం ధరలు ఈ వారంలో పది గ్రాములకు రూ.88వేల గరిష్ఠానికి చేరాయి. 2024లో బంగారం ధరలు 21శాతం పెరిగాయి. ఈ ఏడాది కేవలం 45 రోజుల్లోనే బంగారం ధరలు 10శాతానికిపైగా పెరిగాయి. చైనీస్ న్యూ ఇయర్‌కు ముందు డిమాండ్‌ను చూశామని.. కానీ, ఇప్పుడు అధిక ధరల కారణంగా డిమాండ్ కనిపించడం లేదని ఓ చైనా వ్యాపారి పేర్కొన్నారు.

## మహీంద్రా ఈవీలకు డిమాండ్

మహీంద్రా అండ్ మహీంద్రాకు చెందిన ఈవీలకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. సంస్థకు చెందిన ఎక్స్ఈవీ 9ఈ, బీఈ 6 మాడళ్లకు తొలిరోజే 30,170 బుకింగ్‌లు వచ్చాయని తెలిపింది. వీటి మొత్తం నికర విలువ రూ.8,472 కోట్లు(షోరూం ధర ప్రాతిపదికన). ఈ విషయాన్ని మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా తన ఎక్స్‌లో వెల్లడించారు. గత నెలలో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ రెండు మాడళ్లపై ఈ శుక్రవారం నుంచి కమర్షియల్ బుకింగ్‌ను ఆరంభిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కారు రూ.18.9 లక్షల నుంచి రూ.30.5 లక్షల లోపు లభించనున్నది.



## విరాట్ కోహ్లీ రికార్డ్‌ను బ్రేక్..

**-అత్యంత వేగంగా 6 వేల పరుగుల మైలురాయి**

**-చరిత్ర సృష్టించిన బాబర్ ఆజామ్**

పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజామ్ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 6 వేల పరుగుల మైలురాయి అందుకున్న బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లో బాబర్ ఆజామ్ ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్థాన్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఫకార్ జమాన్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించిన బాబర్ ఆజామ్.. జాకోబ్ డఫ్ఫీ వేసిన ఏడో ఓవర్‌లో ఓవర్‌పిచ్‌డ్ డెలివరీని కవర్స్ వైపు ఆడి 6000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు. 123వ ఇన్నింగ్స్‌లోనే బాబర్ ఆజామ్ ఈ ఫీట్ సాధించి.. హషిమ్ ఆమ్లాను సమం చేశాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీని వెనక్కి నెట్టాడు. భారత మాజీ కెప్టెన్ 136 ఇన్నింగ్స్‌ల్లో 6వేల పరుగులు పూర్తి చేశాడు. కేన్ విలియమ్సన్, డేవిడ్ వార్నర్ 139



ఇన్నింగ్స్‌ల్లో ఈ ఫీట్ సాధించగా.. శిఖర్ ధావన్ 140 ఇన్నింగ్స్‌ల్లో 6 వేల పరుగులను పూర్తి చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బాబర్ ఆజామ్ 26 ఏళ్ల పాత రికార్డ్‌ను అధిగమించాడు. 1992 వరల్డ్ ఛాంపియన్స్‌లో పాకిస్థాన్ మాజీ ఓపెనర్ సయీద్ అన్వర్ 150 ఇన్నింగ్స్‌ల్లో 6000 పరుగుల చేసి ఆ దేశం తరఫున అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. తాజా బాబర్ ఆజామ్ అతన్ని అధిగమించాడు. బాబర్ ఆజామ్ ఇప్పటికే వన్డేల్లో అత్యంత వేగంగా 5వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డు సాధించాడు. 2023లో 97 మ్యాచ్‌ల్లో అతను ఈ ఘనతను అందుకున్నాడు. వన్డే ప్రపంచకప్ 2023 అనంతరం బాబర్ ఆజామ్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. గత ఏడు ఇన్నింగ్స్‌ల్లో 2 హాఫ్ సెంచరీలు మాత్రమే చేశాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు వామప్‌గా జరుగుతున్న తాజా సిరీస్‌లోనూ బాబర్ ఆజామ్ దారుణంగా విఫలమయ్యాడు. తాజా మ్యాచ్‌లోనూ 29 పరుగులే చేసి వెనుదిరిగాడు. ఔటైన ఫ్రస్టేషన్‌లో బ్యాట్‌ను కిందపడేసాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. సౌతాఫ్రికాతో జరిగిన గత మ్యాచ్‌లో 23 పరుగులే చేసిన బాబర్ ఆజామ్.. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 10 పరుగులే చేసి విఫలమయ్యాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు అతని పేలవ ఫామ్ పాకిస్థాన్ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్(46), సల్మాన్ అఘా(45) నాలుగో వికెట్‌కు 88 పరుగులు జోడించడంతో పాకిస్థాన్ 200 పరుగుల మార్క్‌ను ధాటగలిగింది.

# స్పోర్ట్స్

## మార్చి 23న రాజస్థాన్ తో తలపడనున్న హైదరాబాద్!?

**తొలి మ్యాచ్‌ను సొంత మైదానంలో ఆడే అవకాశం!**



క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 మరికొన్ని రోజులు ప్రారంభంకానుంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన కొద్ది రోజుల్లోనే ఈ క్రేజీ టీ20 లీగ్ స్టార్ట్ అవ్వనుంది. అయితే, ఇంకా కిక్ ఇచ్చే వార్త ఏంటంటే.. ముందుగా షెడ్యూల్ చేసిన తేదీ (మార్చి 23) కంటే ఒకరోజు ముందే సీజన్ స్టార్ట్ కానుంది. మార్చి 22న 18వ ఎడిషన్ ఐపీఎల్ ప్రారంభంకానుంది. ఈ మేరకు క్రిక్‌బజ్ వర్గాలు పేర్కొన్నాయి. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరగనుంది. ఇక గత సీజన్‌లో ఫైనల్‌కు చేరిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తన తొలి మ్యాచ్‌ను సొంత మైదానం ఉప్పల్ స్టేడియంలో ఆడనుంది. రాజస్థాన్ రాయల్స్‌తో మార్చి 23న తలపడనున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్ మ్యాచ్ మే 25న జరిగే అవకాశం ఉంది. అయితే, ఐపీఎల్ వర్గాల నుంచి మాత్రం అధికారికంగా దీనిపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. షెడ్యూల్‌కు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మొత్తం మ్యాచ్‌లు 12 మైదానాల్లో జరగనున్నాయి. అహ్మదాబాద్, ముంబయి, చెన్నై, బెంగళూరు, లఖ్‌నవూ, ముల్లాన్‌పూర్, ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, హైదరాబాద్ స్టేడియాలతోపాటు గువాహటి, ధర్మశాల కొన్ని మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. రాజస్థాన్ రాయల్స్‌కు గువాహటి రెండో హోం గ్రౌండ్‌గా.. పంజాబ్ కింగ్స్‌కు ధర్మశాల రెండో సొంత మైదానంగా ఉండనున్నాయి. మొత్తం 10 టీమ్స్ ఐపీఎల్ 2025 సీజన్‌లో పోటీ పడనున్నాయి. ఆర్సీబీ కొత్త కెప్టెన్‌గా రజత్ పటీదార్ నియమితులైన సంగతి తెలిసిందే. ఇప్పటికే ముంబయికి హార్దిక్, చెన్నైకి రుతురాజ్ గైక్వాడ్, హైదరాబాద్‌కు పాట్ కమిన్స్, గుజరాత్‌కు గిల్, లఖ్‌నవూకు రిషభ్ పంత్, రాజస్థాన్‌కు సంజుశాంసన్, పంజాబ్ కింగ్స్‌కు శ్రేయస్ అయ్యర్ ఉన్నారు. ఐతే, కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్లను నియమించాల్సిఉంది. ఢిల్లీకి కేఎల్ రాహుల్ లేదా అక్షర్ పటేల్ సారథ్యం వహించే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

## ఛాంపియన్‌గా నిలిచిన జట్టుకు 20కోట్లు

**-53 శాతం పెరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రైజ్ మనీ**

**-ప్రకటించిన ప్రైజ్ మనీ మొత్తాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్**

2025 ఛాంపియన్స్ ట్రోఫీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. ఇదిలా ఉండగా, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రైజ్ మనీని ప్రకటించింది. 8 జట్ల మధ్య జరిగే ఈ టోర్నమెంట్ కోసం ఐసీసీ భారీ ప్రైజ్ మనీని అందించనుంది. విశేషమేమిటంటే, గత ఛాంపియన్స్ ట్రోఫీతో పోలిస్తే ప్రైజ్ మనీని 53% పెంచారు. అదే సమయంలో, గ్రూప్ దశలో మ్యాచ్‌లు గెలిచినందుకు జట్లకు ప్రత్యేకంగా డబ్బు అందనుంది. టోర్నమెంట్‌లో చివరి స్థానంలో నిలిచిన జట్టు కూడా ఖాళీ చేతులతో తిరిగి రాదన్నమాట. 8 సంవత్సరాల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ తిరిగి రాబోతోంది. ఈ టోర్నమెంట్ ఇంతకు ముందు 2017 సంవత్సరంలో జరిగింది. ఈసారి ప్రైజ్ మనీ మునుపటి ఎడిషన్‌తో పోలిస్తే 53% పెంచారు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ మొత్తం ప్రైజ్ మనీ %ఖూవి%6.9 మిలియన్లు. ఈసారి ఛాంపియన్‌గా




నిలిచిన జట్టుకు 2.24 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు 20 కోట్ల రూపాయలు అందనున్నాయి. అదే సమయంలో, రన్నరప్ జట్టుకు 1.12 మిలియన్ డాలర్లు అంటే దాదాపు 10 కోట్ల రూపాయలు లభిస్తాయి. దీనితో పాటు, సెమీ-ఫైనల్లో ఓడిన రెండు జట్లకు కూడా దాదాపు రూ.5 కోట్ల ప్రైజ్ మనీ దక్కనున్నాయి. ప్రత్యేకత ఏమిటంటే గ్రూప్ దశలో ఎలిమినేట్ అయ్యే జట్లు కూడా ఖాళీ చేతులతో వెళ్లవు. ఐదవ లేదా ఆరవ స్థానంలో నిలిచిన జట్లకు 3.5 లక్షల డాలర్లు, అంటే దాదాపు 3 కోట్ల రూపాయలు లభిస్తాయి. అదే సమయంలో, 7వ, 8వ స్థానాల్లో నిలిచిన జట్లకు 1 లక్ష 40 వేల డాలర్లు అంటే 1 కోటి 20 లక్షల రూపాయలు అందనున్నాయి. ఇది కాకుండా, గ్రూప్ దశలో ప్రతి విజయానికి 34 వేల డాలర్లు అంటే సుమారు 30 లక్షల రూపాయలు దక్కనున్నాయి. మరోవైపు, ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నందుకు ఎనిమిది జట్లకు 125,000 అంటే విడివిడిగా సుమారు రూ.1 కోటి ఇవ్వనున్నారు.

# చీరలో నాని హీరోయిన్ అందాల విందు



2019లో నాని గ్యాంగ్ లీడర్ సినిమాతో తెలుగు అభిమానులను పలకరించిన ఈ ముద్దుగుమ్మ తర్వాత, శ్రీకారం, సరిపోదా శనివారం సినిమాల్లో నటించి మెప్పించింది.ఇందులో మరోసారి హీరో నాని సరసన సరిపోదా శనివారం సినిమాలో నటించి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. అయితే సినిమా హిట్ అయినా ఈ బ్యూటీకి మాత్రం తెలుగులో ఆశించిన రేంజ్ లో అవకాశాలు రాలేదనే చెప్పాలి.ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ తమిళ చిత్రాలతో ఫుల్ బిజీగా ఉంది. అంతే కాకుండా తెలుగులో కూడా ఓ సినిమా చేస్తున్నట్లు సమాచారం.అయితే ఈ నటి ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ, ఎప్పటికప్పుడు తన హాట్ హాట్ ఫొటో షూట్స్‌తో కుర్రకారు మనసు దోచేస్తుంది. తాజాగా ఈ అమ్మడు చీరలో తన అందాలతో కుర్రకారుకు విందు ఇచ్చింది.నెట్టెడ్ వైట్ శారీ కట్టుకొని, చమ్కీలతో చాలా కలర్ ఫుల్‌గా కనిపించింది. ఈ చీరలో ఈ అమ్మడు చూడ ముచ్చటగా కనిపస్తుంది. దీంతో ప్రస్తుతం శారీలో ఈ అమ్మడు అందానికి తన ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. చీర కట్టులో చూడ ముచ్చటగా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కాగా, ఈ ఫొటోస్ పై మీరు కూడా ఓ లుక్ వేయండి.




# ఆకట్టుకుంటున్న హరిహరవిరమల్లు పోస్టర్

ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న ప్రాజెక్ట్‌లలో హరిహర వీరమల్లు ఒకటి. పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. ఈ సినిమాను 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇప్పటికే మాట వినాలి అనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా సెకండ్ సింగిల్ అప్‌డేట్‌ను పంచుకుంది.ఈ సినిమా నుంచి కొల్లగొట్టినాదిరో అనే రెండో సింగిల్‌ను ఫిబ్రవరి 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా వాలంటైన్స్‌డేను పురస్కరించుకొని కొత్త పోస్టర్‌ను పంచుకుంది. జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# కంటి చూపుతూ చంపేస్తున్న బేబమ్మ..

ఈ ముద్దుగుమ్మ చేసిన సినిమాల్లో బంగార్రాజు, ఉప్పెన సినిమాలు బ్లాక్ బస్టర్‌గా నిలవగా మిగితా సినిమాలు మాత్రం అంత బజ్ క్రియేట్ చేయలేకపోయాయి. ముఖ్యంగా చెప్పాలంటే చేసిన ప్రతి సినిమా డిజాస్టర్‌గా మిగిలిపోయాయి.దీంతో ఈ అమ్మడుకు టాలీవుడ్‌లో ఆఫర్స్ రాకపోవడంతో తమిళ్, కన్నడ ఇండస్ట్రీస్ పై కన్నేసింది ఈ బ్యూటీ. ప్రస్తుతం అక్కడ వరస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.అయితే ఓవైపు సినిమాలు చేస్తూనే, మరో వైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది కృతి. ఎప్పటికప్పుడు వరస ఫొటో షూట్స్ చేస్తూ.. తన అందంతో మతి పొగొడుతుంది.తాజాగా ఈ బ్యూటీ, కురులు విర బోసి చేతిలో ఫ్లవర్స్ పట్టుకొని, ఫొటోలకు ఫోజులిచ్చింది. వైట్ కలర్ గౌన్‌లో సింపుల్ లుక్‌లో ఎంతో ముద్దుగా ఉంది ఈ అమ్మడు .ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కంటి చూపుతో చంపకు బేబీ అని కొందరు కామెంట్స్ చేస్తే, మరికొందరు మాత్రం, వైట్ డ్రెస్‌లో చాలా క్యూట్ గా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా ఆ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.




# తండ్రీకొడుకుల అనుబంధం.. 'రామం రాఘవం' ట్రైలర్ రిలీజ్

తమిళ దర్శకుడు, నటుడు సముద్రఖని , ధన్‌రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రామం రాఘవం' . ఈ సినిమాతో జబర్దస్థ్ నటుడు ధనరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్ పై ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వి పొలవరపు నిర్మిస్తున్నాడు. తండ్రీకొడుకుల సెంటిమెంట్ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్‌ని విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఇదిలావుంటే ఈ సినిమాను ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ ట్రైలర్ ను హీరో నాని విడుదల చేశారు. అనంతరం చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. తన కొడుకు జీవితంలో గొప్పగా ఎదగాలని ఒక తండ్రి ఆశిస్తుండగా.. నాన్న తనను అసలే అర్థం చేసుకోవడం లేదని బాధపడుతున్న కొడుకు సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా రాబోతుంది.మోక్ష, హరీష్ ఉత్తమన్, సత్య పృధ్వి, శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను, ప్రమోదిని, రాకెట్ రాఘవ, రచ్చ రవి, ఇంటూరి వాసు, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి విమానం చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల కథ ను సమకూర్చగా అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్నాడు, మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్. దుర్గా ప్రసాద్ ఈ సినిమాకు కెమెరామెన్.

# దుల్కర్ సల్మాన్ 'కాంత'లో హీరోయిన్‌గా భాగ్యశ్రీ భోర్సే..

మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్, దగ్గుబాటి రానా మల్టీస్టారర్‌గా వస్తున్న చిత్రం 'కాంత'. ఈ సినిమాకు తమిళ దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. స్పిరిట్ మీడియా, వేఫేరర్ ఫిల్మ్స్ పతాకాలపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 1950 మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం మానవ బంధాలు, సామాజిక మార్పులతో గొప్ప అనుభూతిని పంచేలా ఉంటుందని దర్శకుడు ఇప్పటికే ప్రకటించాడు.ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఇప్పటికే దుల్కర్ ఫస్ట్‌లుక్‌ని పంచుకోగా.. దుల్కర్ రెట్రో స్టైల్‌లో అలరిస్తున్నాడు. అయితే వాలంటైన్స్ కానుకగా తాజాగా భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492